
ప్రజాశక్తి

గురువారం 6 మార్చి 2025

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'ఎంఎస్ఎంఇ' సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను గుర్తించి వాటి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పరిశ్రమల వివరాలను నమోదు చేసేందుకు పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ విభాగం అధికారులకు అదనపు కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎ.సి నగర్ జిల్లా పారిశ్రామిక నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో బుధవారం ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ అధికారులతో అదనపు కమిషనర్ సమావేశం య్యారు. ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ ఫుడ్ కాంప్లెక్స్ ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాలలో ఉన్న సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలను గుర్తించి సర్వేలో వాటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఐ.ఎల్.ఎ కమిషనర్ బ్రహ్మయ్య, జిల్లా పారిశ్రామిక నైపుణ్య అభివృద్ధి కేంద్రం జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

కృష్ణపట్నం టు రామాయపట్నం..!

- పేదల భూములు పెద్దలకు ధారాదత్తం
- పరిశ్రమల్లేవ్..ఉద్యోగాలురావ్
- బీడుగా సాగుభూములు దర్శనం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఒకప్పుడు విశాఖపట్నం తర్వాత అంత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న నగరంలో నెల్లూరు ఒకటి. 2004 నుంచి ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో పెద్ద ఎత్తున పారిశ్రామికరణ జరుగుతుందని అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు ప్రత్యేక మండళ్లు ఏర్పాటు చేశారు.

ఒకప్పుడు ఆసియాలోనే అతిపెద్ద పోర్టు కృష్ణపట్నం...భారీగా పరిశ్రమలు... లక్షల్లో ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులకు ఆశలు పెట్టారు... రైతులు భూమిలిస్తే మీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు. ఇష్టంగానో...భయపెట్టో..బెదిరించి వేలాది ఎకరాలు రైతుల నుంచి తీసుకున్నారు. ఇప్పటికీ పరిశ్రమలు రాలేదు.. ఉన్న కృష్ణపట్నం పోర్టు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది రైతుల నుంచి తీసుకున్న సాగు భూములు బీడులుగా ఉన్నాయి. ఇక్కడ ప్రజలు పనుల్లేక ఇతర ప్రాంతాలకు వసలు వెళుతున్నారు...ఒకప్పుడు కృష్ణపట్నంకు ఉపయో గించుకున్న ప్రజా ప్రతినిధులు, నేతలు ఇప్పుడు రామాయపట్నం వైపు చూపు మళ్లించారు... దేశంలోనే అత్యంత భారీ పరిశ్రమ రూ.95 వేల కోట్లు పెట్టుబడులు..సోలార్ ఫ్యానల్స్ పరిశ్రమలు.. దానికి అనుబందంగా పరిశ్రమలు. నెల్లూరు జిల్లాతోపాటు కావలి ప్రాంతంలోనూ వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాది, ఉద్యోగాలు వస్తాయని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలు వస్తే అందరికీ ఆనందమే. ఆపేరుతో రైతుల భూములు తీసుకొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. రామా యపట్నంలో సుమారు 20 వేల ఎకరాలు స్వీకరించనున్నారు. ఇది రైతుల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన కలిగిస్తోంది.

కృష్ణపట్నం పోర్టు ఆధారంగా 32వేల ఎకరాల్లో 32 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. పోర్టు పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని హామీ ఇచ్చారు. 2004 నుంచి 2008 వరకు సుమారు 75 వేల ఎకరాలు భూములు ప్రభుత్వ, పట్టా, భూములు కార్పొరేట్ శక్తులకు అప్పగించారు. ఇందులో కృష్ణపట్నం, చింతవరం, మాంబట్టు, మేనకూరు, చిల్లకూరు, ఉండగా, అంతకు ముందు కిసాన్‌సెజ్ కోసం 2700 ఎకరాలిచ్చారు. ఇందులో కేవలం 30 శాతం భూములను పరిశ్రమల కోసం ఉపయోగించలేదు. థర్మల్ ప్రాజెక్టులు పెట్టినట్లు మూసేశారు.

రిలయన్స్ థర్మల్ పవర్ పేరుతో కృష్ణపట్నం గ్రామంలో 2500 ఎకరాలు తీసుకున్నారు. పోర్టుకు ఆరు వేల ఎకరాలు, సెజ్‌కోసం మరో 6 వేల ఎకరాలి చ్చారు. చింతవరం అటకెక్కింది. తమ్మినపట్నం, చిల్లకూరు, ముత్తుకూరు, నాయుడుపేట, తడ, ప్రాంతా ల్లోనూ తీసుకున్న భూములు పెద్దలు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించింది. ఇప్పుడు అక్కడ పరిశ్రమలు రాలేదు. నిరు ద్యోగులకు ఉపాధి అవకాశాలు రాలేదు. అత్యంత దారుణమైన విషయం కృష్ణపట్నం గ్రామంలో రైతులు సాగు చేసుకునే భూ ములు బలవంతంగానే తీసు కున్నారు. రిలయన్స్‌కు అప్పగించారు. భూములు స్వాధీనం చేసుకొని చుట్టూ ప్రహరీ కట్టించి, బీడుగా పెట్టారు. 19 సంవత్సరాల నుంచి ఉంది. రైతులు చేయడానికి వ్యవసాయం లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. ఇలా అనేక గ్రామాల్లో పరిశ్రమల పేరుతో జరిగిన భూ దోపిడీకి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట భూముల్లేక, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు, ఉపాధి కరువై ఇప్పుడు రైతులు, వారి పిల్లలు కన్నీరు పెడుతున్నారు. 2004 నుంచి 2008 వరకు పారిశ్రామీకరణ పేరుతో జరిగిన హడావుడి అంతా ఇంత కాదు.

ఇప్పుడు రామాయపట్నం పాట..!

రాష్ట్ర ప్రభుత్వం కృష్ణపట్నం, జిల్లాలోని ఎస్ఇజెడ్‌లో పరిశ్రమల ఏర్పాటు పక్కన పెట్టి, రామాయపట్నం కథను ముందుకు తీసు కొస్తున్నారు. పరిశ్రమలు రావడాన్ని జిల్లా ప్రజలు, రాజకీయపార్టీలు, స్వాగతిస్తున్నాయి. ఆ పేరుతో హడావుడి చేసి, భూములు లాక్కోవడాన్ని జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కళ్లముందు కనిపిస్తోన్న కథలే వారికి గుర్తుకు వస్తున్నాయి. తాజాగా రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామీకరణ పేరుతో హడావుడి మొదలైంది. సుమారు రూ.95 వేల కోట్లు పెట్టుబడితో 5 వేల ఎకరాల్లో బిపిసిఎల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయనే ప్రచారం సాగుతోంది. ఈ పరిశ్రమకు అనుబ ంధంగా . రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. దుబాయి, ఖత్తర్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి రామాయపట్నం పోర్టుకు ఓడల ద్వార క్రూడాయిల్ తీసుకొస్తారు దానిని శుద్ధిచేసే కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు ప్రభుత్వం ప్రకటించింది. . ఇక్కడ నుంచి పైప్‌లైన్ ద్వార ఇతర ప్రాంతాలకు తీసుకెళతారు.. విభజన చట్టంలోనే ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రకటన చేశారు. పెట్రోకెమికల్ ప్లాంట్, లూబ్రికెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యుయల్ అడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆఫాల్ట్ ప్రొడక్షన్, సర్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మానుఫ్యాక్చరింగ్, రిఫైనరీ మెయింటెనెన్స్ సర్వీస్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎన్విరాన్‌మెంటల్ సర్వీస్, ట్యాంక్ మానుఫ్యాక్చరింగ్, పైప్ మానుఫ్యాక్చరింగ్, వాల్వ్ మానుఫ్యాక్చరింగ్, ఇన్‌సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ వంటి 15 అనుబంధ పరిశ్రమలు వస్తాయని ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మరో 10 వేల ఎకరాలు భూమి సేకరించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఇండస్ట్రీయల్ కార్యదర్శి ఎన్., యువరాజ్ రామాయపపట్నం పోర్టు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనువైన భూములు గుర్తించినట్లు తెలిసింది. కందుకూరు, కావలి నియోజవర్గాల్లోని అనెమడుగు, చెన్నాయపాళెం, చేవూరు, రావూరు, సాలిపేట, చెన్నాయపాళెం, రుద్రకోట, ఆవుల వారిపాళెం, మొండివారి పాళెం, కర్లపాళెం గ్రామాల్లో భూసేకరణ చేశారు. ప్రస్తుతం చేస్తున్నారు. ఇప్పటికే తీసుకున్న భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వలేదని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మరికొందరికీ పరిహారం ఇవ్వడంతో అన్యాయం జరిగినట్లు సమాచారం. స్థానిక అధికారుల చుట్టూ రోజూ తిరుగు తున్నారు. ఆ ప్రాంతంలో మంచి సారవంతమైన భూములు న్నాయి. పరిశ్రమ వస్తే తమ భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ కృష్ణపట్నం పరిస్థితులు పునరావృతం అవుతాయనే భయం అక్కడ రైతులను వెంటాడుతోంది.



రిలయన్స్ సంస్థ తీసుకున్న 2500 ఎకరాల భూమి



రామాయపట్నం పోర్టు వద్ద నిర్మాణానికి వేగంగా పనులు జరుగుతున్న దృశ్యం

ఆత్మగౌరవంతో మహిళలు జీవించాలి

8 నుంచి 'సూపర్ సిక్స్' అమలు చేయాలి - ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి- నెల్లూరు : ఆత్మగౌరవంతో మహిళలు జీవించే విధంగా, అత్యాచారాలను నిరోధిం చేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేసేందుకు ప్రభుత్వాలు చిత్త శుద్ధితో పనిచేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని నెల్లూరు నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో మహిళా సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్‌ను మార్చి 8 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత స్థాయిలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్చి 8 నుంచి సూపర్ సిక్స్ అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజలను చైతన్య పరిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు, ఉద్యమాలు చేపట్టనున్నామన్నారు. మహిళల సాధికారతకు, సమానత్వానికి చర్యలు వేగవంతం చేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపు నిచ్చిందన్నారు. 30 సంవత్సరాల క్రితం ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మహిళల అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారన్నారు. ఈ ప్రకటలన్నీ కేవలం మాటలకు, కాగితాలకు మాత్రమే పరిమితం కాగా సోషలిస్టు దేశాల్లో మాత్రమే ప్రాథమికంగా మహిళలకు అవసరమైనటువంటి సమానత్వాన్ని సమకూర్చడం వంటి చర్యలు అమలు అవుతున్నాయన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏదైతే కేంద్ర ప్రభుత్వం సమానత్వం కోసం రకరకాల పథకాలు ప్రకటించిందో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో మహిళలకు సమాన వాటాను జెండర్ బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నా యన్నారు. శ్రామిక మహిళలుగా ,స్కీం వర్కర్లుగా, 25 లక్షలకు పైగా అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లుగా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్నది లక్షలాది మహిళలే అని గుర్తు చేశారు. సమావేశంలో అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, ఐద్వా నగర నాయకురాలు కె.పద్మ, సుబ్బమ్మ, శంషాద్, వరలక్ష్మి, పలువురు ఐద్వా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి రమాదేవి

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

సమస్యను పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని నూకవరం ఎస్‌సి కాలనీకి 167బీ జాతీయ రహదారి నుంచి ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టకుండా రైతులు అడ్డగించటంతో తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు బుధవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జాతీ య రహదారిగా విస్తరణ జరిగినా కందుకూరు-పామూరు రోడ్డు ఆర్ అండ్ బి రో డ్డుగా ఉన్నప్పటినుంచి ఈ రహదారి నుంచి నూకవరం ఎస్‌సి కాలనీకి లింకురోడ్డు ఉంది. ప్రస్తుతం ఆ రహదారిని అభివద్ధి చేసి అప్రోచ్ నిర్మించేందుకు ఎన్‌హెచ్ అధికా రులు ప్రయత్నించగా ఇంటూరి చెంచమ్మ, ఆమె కుమారుడు లక్ష్మీనరసిం హ్మంలు అడ్డగించి ఇది మా పట్టాభూమి అని ఇక్కడ రోడ్డు వేయటానికి వీలేదని పనులను నిలిపివేయించారని వారు వినతిలో పేర్కొన్నారు. సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టరు హామీనిచ్చారు. బద్దిపూడి శిఖామణి, నరసింహ్మం, ఏసేబు, ఆనందరావు, ఇసాక్, శిరోమణి, సుధాకర్ ఉన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌సి కాలనీవాసులు

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుడ్లూరు మండలంలోని బసిరెడ్డి పాలెం పంచాయతీలోని హైస్కూల్లో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించాలన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. పిల్లలు ఎత్తు, బరువు పరిశీలించి బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని ఎలా అందించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇంకా పిల్లలకు హ్యాండ్ వాష్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కామేశ్వరి సి.హెచ్.ఓ .భాస్కరరావు ఎం.ఎల్ .హెచ్పి .ఎన్ .మనీషా ఏఎన్ఎం .పి ప్రభావతి, .ఆశ కార్యకర్త .ప్రమీల, అంగన్ వాడీ కార్యకర్తలు సిహెచ్ .మీనా. గీత .చిన్నమ్మాయి, అరుణ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

9న ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు మండలంలోని వికలాంగ లబ్ధిదారులకు ఎంపి వేమిరెడ్డి పభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 9న ట్రై సైకిళ్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. గుడ్లూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రై సైకిళ్లు పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. టిడిపి మండల అధ్యక్షులు జయనగర్ల నాగరాజు పువ్వాడి వేణుగోపాల్ మేకపోతులు రాఘవయ్య జామ వెంకటేశ్వర్లు ఉమ్మనేని సుబ్బారావు గుడ్లూరు సర్పంచి శంకరు, ఎపిఒ వెంకటేశ్వర్లు, టిఎలు, ఉపాధి హామీ సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించిన వారిలో ఉన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పలుచోట్ల పొలం పిలుస్తోంది..!

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

మండలంలోని సాలిపేట, మోచర్ల, రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు అనసూయ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లా డారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రైతు సేవా కేంద్రాల పరిధిలో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమ ంలో అందించే పంట సంబంధిత విషయాలను తెలుసుకొని తదను గుణంగా అమలుపరచి మేలైన దిగుబడులు సాధించాలని సూచించారు. సొంత భూమి ఉన్న ప్రతి రైతు తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని 11 అంకెల గుర్తింపు నెంబర్ పొం దాలని సూచించారు. నాయకులు, గ్రామ వ్యవసాయ షారూఖ్ , ఝాన్సీ ఉన్నారు.



గుడ్లూరు రూరల్లో..

ప్రజాశక్తి-కం దుకూరు : మండలంలోని జి మేకపాడులో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది.ఎఒ రాము మాట్లాడుతూ రైతులు అందరూ తప్పనిసరిగా రబీ సీజన్‌లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలన్నారు. జి మేకపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు టీ.రోసిరెడ్డి, గ్రామ పశు వైద్య సహాయకులు సి హెచ్.ప్రసాదు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఒ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర కల్పించి 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుధవారం మనుబోలు మండలం, పిడూరు, మనుబోలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. తొలుత పిడూరు గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. రీ సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతూ రీ సర్వే సమాచారం మీకు అధికారులు చెప్పారా..మీ సమక్షంలో భూమికి కొలతలు వేసి హద్దులు చూపించారా... ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. రైతులందరూ కూడా రీసర్వే పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం మనుబోలు తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రీ సర్వే దరఖాస్తులను పరిశీలించారు. మనుబోలు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, తేమ శాతాన్ని ఎలా నిర్ధారిస్తారో స్వయంగా పరిశీలించారు.కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రైతులందరూ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించి, సకాలంలో డబ్బులు పొందాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైస్ మిల్లర్లతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. రైతులందరూ ధాన్యం ధర నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని మరోసారి సూచించారు. జిల్లా వ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జాయింట్ కలెక్టర్ నిరంతరం వీటిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ వెంట మనుబోలు తాసిల్దార్ సుబ్బయ్య, ఏవో జహీర్, ఆర్ ఐ శ్రీకాంత్, వీఆర్ఓ శ్రీనివాసులు, సర్వేయర్ సోనియా, డిటి మంజుల తదితరులు ఉన్నారు.



ప్రాజెక్టుల ప్రదర్శనలో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కంచర్ల రామయ్య అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : ప్రాజెక్టుల ప్రదర్శనలు , అంతర్ జిల్లాల స్థాయిలో బహుమతులు సాధించిన ప్రకాశం విద్యార్థులను బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్యం కంచర్ల రామయ్య, రీసెర్చ్ డీన్ డాక్టర్ ఎం. లక్ష్మణరావు అభినందించారు. స్మార్ట్ హెల్మెట్,డ్రోన్ ప్రాజెక్టులకు పలు పోటీలలో బహుమతులను గెలుచుకున్నామని వారు వెల్లడించారు. స్మార్ట్ హెల్మెట్‌కు నగదు బహుమతిని విద్యార్థులు ఆదుకోవడం హర్షనీయమన్నారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన శిక్షణ డాక్టర్ లక్ష్మణరావు ,అకాడమిక్ ఇన్‌ఛార్జి ఎస్ ఎన్ మీరావలి అందిస్తారన్నారు. మార్కెటింగ్ స్థాయికి తెచ్చాలా వాటిని అభివద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం అందిస్తున్న స్టార్ట్ ప్ కంపెనీ స్థాపనకు ప్రోత్సాహాన్ని అందించేందుకు కషి చేస్తామని రామయ్య అభయం ఇచ్చారు. తయారీ ఖర్చుతో మార్కెటింగ్ చేసేందుకు విద్యార్థులు సిద్ధమైతే హెల్మెట్ కు 10 శాతం,డ్రోన్ కు 20 శాతం బోనస్ ప్రోత్సాహాన్ని కాలేజీ అందిస్తుం దన్నారు.ప్రస్తుతం మామిడి తోటలో విరివిగా క్రిమి ఎసంహారక మందులను పిచికారి చేస్తున్నారన్నారు.డ్రోనుల వినియోగంలో మందు పొదుపు కావడంతో పాటు చెట్టు మొత్తానికి సమంగా అందుతుందని రైతులు అభిప్రా యపడుతున్నారన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న కంచర్ల రామయ్య

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం

కారు ఢీకొని వృద్ధుడు మతి చెందిన సంఘటనమండలంలోని అయ్యవారిపల్లెలోని జాతీయ రహదారిలో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో జరిగింది.ఆ ప్రమాదంలో అయ్యవారిపల్లెకు చెందిన గుడిమిట్ల పెద మాలకొండయ్య (75) అక్కడికక్కడే మతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దమాలకొండయ్య ఇంటి దగ్గర నుండి బస్టాండు సెంటరుకు టీ తాగేందుకు వస్తున్నాడు. అదే సమయంలో వలేటివారిపాలెం నుంచి మొగిలిచెర్ల వెళ్తున్న కారు వేగంగా మాల కొండయ్యను ఢీకొట్టింది. లింగసముద్రం మండలం, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన పవని నాగేం ద్రప్రసాద్ కారును నేషనల్ హైవేలో డ్రైవింగ్ చేస్తూ ఎడమవైపున వెళ్లాల్సి ఉండగా కుడివైపున 1వెళ్తూ అయవారిపల్లి బస్టాండు సెంటరులో ముందుగా కుమ్మరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని ఢీ కొట్టింది. వెంకటేశ్వర్లు గాయాలతో రోడ్డు మార్జిన్ లో పడిపోయాడు, అప్పటికీ కూడ కారు కంట్రోల్ కాక ముందు వైపున నిలబెట్టి ఉన్న మోటారుబైకును ఢీ కొట్టడంతో మోటారు బైకు నుజ్జునుజ్జయింది. అనంతరం పెద్ద మాలకొండయ్యను ఢీ కొట్టడంతో పెద్ద మాలకొండయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో సమాచారం తెలు సుకున్న వలేటివారి పాలెం ఎస్ఐ మరిదినాయుడు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మతదేహన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మతదేహన్ని వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది. పెద్దమాలకొండయ్య మతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన గుడిమిట్ల పెదమాలకొండయ్య

సత్యకు 'పిడికిటి' జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి- కందుకూరు : రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణను కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు కలిసి బుధవారం జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు ఒంగోలు పట్టణంలో దామచర్ల సత్య నారాయణ జన్మదిన వేడుకలు బుధవారం జరిగాయి. కందుకూ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దామ మల్లేశ్వరరావు, కందుకూరు పట్టణ పార్టీ ప్రదాన కార్యదర్శి ముచ్చు శ్రీని వాసరావు, టిఎన్ఎస్ఎఫ్ నాయ కులు బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పిడికిటి వెంకటేశ్వర్లు దామచర్ల సత్యనారాయణను సన్మానించారు.



దామచర్ల సత్యనారాయణను సత్కరిస్తున్న పిడికిటి వెంకటేశ్వర్లు

7న శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-నెల్లూరు : ఈ నెల 7న నగర ప్లానింగ్ ఆర్‌డిడి శిక్షణా సమావేశం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ సంచాలకులు పట్టణ ప్రణాళికా విభాగం, గుంటూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 7న శు క్రవారం నెల్లూరు నగర పాలక సంస్థతో పాటు ఆత్మకూరు, కావలి, బుచ్చిరెడ్డి పాలెం, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్.టి.పి. లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కందుకూరు : పట్టణంలో తూర్పు సాలిపాలెంలో బుధవారం శ్రీ పల్నాటి వీర్ల అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ శంకుస్థాపన జరిగింది. అనుమల వెంకట శరత్ బాబు భార్య కార్తీక్ శాంతి చేతులు మీదుగా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఆలయ శిల్పులు శ్రీనివాస్, ఉమా శంకర్ మాట్లాడారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

నాగేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శ్రీ అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమం చేసిన వారికి బుధవారం సన్మానం జరిగింది. కందుకూరు రవి స్వీట్ యజమాని కంచర్ల నాగేశ్వరరావు గత ఐదు ఆరేళ్ల నుంచి నుండి ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సాయంగా పలు కార్యక్రమాలకు వస్తువులను, తినుబండారాలను సప్లై చేస్తున్నారు. అందుకు ఆయనకు కమిటీలోని వక్తలు సన్మానం చేశారు. నల్లభోతుల మురళి, కేఎస్ వెంకటేశ్వర్లు , కాటా చెంచురామయ్య ,వున్నం వీరాస్వామి ,గంగవరపు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి పద్మజారెడ్డి

ఎంపిపి ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశాన్ని బుధవారం ఎంపిపి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ మంజులమ్మ మాట్లాడుతూ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సంబంధించి ఈ సంవత్సరానికి సంబంధించిన అమౌంట్‌ను హాస్పిటల్ సంబంధించిన వివిధ రకాల అభివృద్ధి పనులకు వాడుతున్నామని వివరించారు. దానికి ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్, ఎంపిపి వాటికి సంబంధించిన బిల్లులు ఎస్టిమేషన్ వేసి తెలియజేయాలని తదనంతరం ఆమోదిస్తామని తెలిపారు. అదేవిధంగా చిరమన సబ్‌సెంటర్ డాక్టర్ జ్యోతిరాణి మాట్లాడుతూ హెచ్‌డిఎస్ అమౌంట్‌ను ఇద్దరు డాక్టర్లు ఫర్నిచర్ కోసం, వివిధ రకాల పనులకు వినియోగిస్తామని తెలియజేశారు. ఎంపిపి మాట్లాడుతూ గతంలో ఫర్నిచర్‌కు బిల్లు పెట్టి ఉన్నారు, ఒకసారి రికార్డును చూసి సంతకాలు చేస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఎంపిడిఒ ప్రసన్నకుమారితో ఆశావాంబీర్లు వచ్చినప్పుడు రూములు సరిపోవడం లేదని, మీటింగ్ హాల్ కోసం కొత్తగా మంజూరు చేయాలని డాక్టర్లు కోవడంతో ఎంపిపి సమాధానంగా మంత్రికి ఈ విషయాన్ని తెలియపరుస్తామని వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఎంపిపి మాట్లాడుతూ హాస్పిటల్ సిబ్బంది ఒకరికొకరు కోపరేషన్ చేసుకుంటూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలని, ఇది పేదవారి కొరకు ఉన్న హాస్పిటల్ కావున రూములు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. దానికి సమాధానంగా స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో తాము డ్యూటీ చేస్తున్నామని, తమకు ఇక్కడ సరైన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసిపి నేతకు నల్లపరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైసిపి నేత కటారి జయరామయ్య కుటుంబాన్ని మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని మైపాడులో బుధవారం నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఇటీవల మరణించిన వైసిపి నేత కటారి జయరామయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం మైపాడు సర్పంచ్ సోదరుని వెంకయ్య గృహానికి వెళ్ళి వెంకయ్యతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఎంపిటిసి రమణయ్య, విజయ్, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-బిట్రగుంట



కొండ బిట్రగుంటలో వెలసి ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ఎ.రాధాకృష్ణయ్య, హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా ఎంవిఎస్ చౌట్రీ, కార్యనిర్వాహణాధికారి జి.రమణారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి పాలుపంచుకున్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు కావలి బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మి నారాయణ, బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.రాధాకృష్ణయ్య మాట్లాడుతూ 36 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.4,12,510 వచ్చినట్లు తెలియజేశారు.

దళారుల మాటలు విని మోసపోవద్దు..

ప్రజాశక్తి-దగదర్తి



ఆరు కాలాలపాటు కష్టపడి పండించిన పంట దళారుల మాటలు విని మోసపోవద్దు అంటూ అగ్రికల్చర్ ఎఒ అబ్దుల్ రహీం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని ఎందుకంటే ప్రభుత్వం రైతు నష్టపోకూడదని ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వద్ద ధాన్యం నెమ్ము శాతం 17శాతం పరిశీలించుకుని తరువాత మిల్లుకు ధాన్యాన్ని తోలుకొని వచ్చాని ఆయన సూచించారు. అంతేకాక నెమ్ము శాతం కొక్కొ ఉండి మిల్లర్లు ధాన్యం బస్తాకు కేజీ నుంచి 2 కేజీలు తరుగు అడిగితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అలా మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే సమయం అధికారులు సమాచారం చేర వేయడంతో పాటు అట్టివారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు కావడతాయని వారు తెలిపారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి



కావలిలోని 18వ వార్డు జన సైనికుడు ముడకొలను శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం 18వ వార్డులోని ఐస్ ఫ్యాక్టరీ సెంటర్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో ఏర్పాటు చేశామని జిల్లా కార్యదర్శి సమ్మెట నంబులపుబబ్బయ్య తెలిపారు. దానికి ముఖ్య కారకులు టౌన్ సిఐ గిరిబాబు సలహా మేరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చేది ఎండాకాలం ఎక్కువమంది గాలి కొరకు మిద్దెల మీద పడుకోవడం వల్ల దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నందువల్ల ప్రతి ఒక్కరిని జాగ్రత్త పరచడానికి సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 29వ వార్డు ఇన్‌ఛార్జి జానీ, 22వ వార్డు ఇన్‌ఛార్జి షేక్ షమీమ్, 17వ వార్డు ఇన్‌ఛార్జి ధనుష్, 16వ వార్డు ఇన్‌ఛార్జి జిలాని, 28వ వార్డు నాయకులు సోమిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-కావలి

ఉమ్మడి నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ తేదీన కావలి మినీ స్టేడియంలో సాయంత్రం 3 గంటలకు సబ్ జూనియర్స్ బాలుర, బాలికల జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని అసోసియేషన్ చైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వర్లు, సెక్రటరీ వి.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ ఆర్.కృష్ణమూర్తి తెలిపారు. క్రీడాకారులు 03-03-2009 తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. బాలురు, బాలికలు 55 కేజీల బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు 14, 15, 16 తేదీలలో వై.ఎస్.ఆర్. కడప జిల్లాలోని పులివెందులలో జరుగనున్న 34వ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్ 9440503548, 9298950860 నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

నాగబాబుకు అళహరి అభినందనలు

ప్రజాశక్తి-కావలి



ఎంఎల్‌ఎల కోటాలో నిర్వహించే ఎంఎల్‌సి ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా జనసేన అభ్యర్థి కొణిదెల నాగబాబు పేరును పార్టీ ఖరారు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను కావలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అళహరి సుధాకర్ ఆయనను కలిసి అభినందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు. ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయానికి శ్రీ పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

భూసేకరణ ఆపకుంటే పోరాటమే..

ప్రభుతానికి వ్య.కా.సం. రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరిక

ప్రజాశక్తి-కావలి

బలవంతపు భూసేకరణ ఆపకపోతే వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కావలి రూరల్ మండలంలో పర్యటించి, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనేమడుగు రెవెన్యూ పరిధిలో 6 గ్రామాలలో బిపిసిఎల్ సోలార్ కంపెనీల కోసమని రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీష్ పేపర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి ప్రజలను భయ భ్రాంతులను సృష్టించి మీ భూమిలో ఇవ్వక పోతే మీకు ఎటువంటి నష్టపరహారం రాదని ఆర్‌డిఒ అధికారులు వచ్చి బలవంతం గా భూములు తీసుకోవడాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈ గ్రామాలలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పర్యటించి గ్రామసభలలో ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ గ్రామాలలో కావలి ఎడమ కాలువ కింద 27 ఎకరాలలో రెండు పంటలు పండేసారవంతమైన భూమి ఉన్నది ఈ భూమిపై వేలాది కుటుంబాల ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ భూమిలో పక్కన సోలార్, బిపిసిఎల్ పరిశ్రమల వల్ల సారవంతమైన భూములలో పంటలు పండక, అదేవిధంగా ఈ భూ సేకరణ వల్ల వ్యవసాయ కార్మికులకు వృత్తిదారులకు పనుల్లేక వలసలు పోవాల్సి వస్తుందన్నారు. అందుకోసమే 2013 చట్టం ప్రకారంగా ప్రజల అభిప్రాయాలు తీసుకొని ఈ భూములు తీసుకోవాలని బలవంతంగా తీసుకోవడానికి ప్రతిఘటిస్తే మార్చి 17వ తేదీన ఆర్‌డిఒ ఆఫీసుని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ గ్రామాలలో చేసిన పర్యటనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, జొన్నలగడ్డ వెంకమరాజు, మారుపూడి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న వ్య.కా.సం. రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-మర్రిపాడు

సోమశిల హై లెవెల్ కెనాల్‌కు బడ్జెట్లో నిధులు కేటాయించి కరువు ప్రాంతాన్ని ఆదుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును విజయవాడలో కలిసిన ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మ కూరు, అనంతసాగరం, మర్రిపాడు మండలాలు, ఉదయగిరి నియోజక వర్గంలో ఉదయగిరి దుత్తలూరు వింజమూరు మండలాలు ఉన్నాయని మంత్రికి వివరించారు. ప్రతి ఏడాదిమెట్ట ప్రాంతాలలో కరువు విలయతాండవం చేస్తుందన్నారు. తాగునీటి వసతి లేక ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలుగా మారడంతో గ్రామాలకు గ్రామాలే వలసలు వెళుతున్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు 6 మండలాలకు అతి సమీపంలో ఉన్న సోమశిల ప్రాజెక్టు నుండి హై లెవెల్ కెనాల్ తవ్వి 7 బ్యాలెన్సింగ్ చెరువులు, 5 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించి కరువును పారదోలేందుకు 2012లో అప్పటి ప్రభుత్వం సోమశిల హైలెవెల్ కెనాల్‌కు ఉత్తర్వులు ఇచ్చి మంజూరు చేసి 95వేల ఎకరాలకు సాగునీరు, 2.5లక్షల మందికి తాగు నీరు అందించడానికి మంజూరు చేశారన్నారు. ఈ కెనాల్‌ను రూ.1520 కోట్లతో రెండు ఫేజ్‌లలో నిర్మించాలని, మొదటి ఫేజ్‌లో రూ.850 కోట్లు, రెండవ ఫేజ్‌లో రూ.670 కోట్లతో పూర్తి చేయాలని తెలియజేశారు. మొదటి ఫేజ్‌లో రూ.850 కోట్లు కేటాయించగా కొంత నిర్మాణ పనులు జరగా, కొంతకొంత ఆగిపోవడంతో మోటార్లు పైపులు తుప్పు పట్టి పోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తరువాత కెనాల్కు ఎటువంటి కేటాయింపులు చేయకపోవడంతో పనులు జరగక మెట్టప్రాంత వాసులు కష్టాలు తీరలేదని మంత్రికి వివరించారు. మెట్టప్రాంత వాసులపై దృష్టి సారించి బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ఆశయాల సాధనకు టిడిపి ఆవిర్భావం

ప్రజాశక్తి-కావలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

ప్రతిఒక్కరికి కూడు గూడు గుడ్డ ఇవ్వాలనే సిద్ధాంతాలతో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019-2024 ఉన్న వైసిపి ప్రభుత్వం ఒక సెంటు ఇంటి పేరుతో నాణ్యతలేని నాసిరకం ఇల్లులు నిర్మించి, అదికూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుత స్కీంలో ఒక కాలానికి రూ.2.50,000, ఎస్‌టిలకు అదనంగా రూ.75వేలు, ఎస్‌సి, బిసిలకు అదనంగా రూ.50వేలు ఇస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పడం చాలా శుభ పరిణామమన్నారు. గతంలో అధికారులు టార్గెట్ కోసం బేస్‌మఠం నిర్మించుకొని వారిని కూడా నిర్మించుకోని వారిని కూడా నిర్మించుకున్నారని సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. అలాంటి వారిని అందరిని కూడా గుర్తించి ఇప్పుడు టిడిపి ప్రభుత్వంలో నిర్మిస్తున్న కొత్త స్కీమ్‌లో వారి పేర్లు కూడా చేర్చాలని కృష్ణారెడ్డి కోరారు.

అసెంబ్లీలో గళమెత్తిన ఎంఎల్‌ఎ 'కాకర్ల'

ప్రజాశక్తి-ఉదయగిరి



అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ మెట్ట ప్రాంత అభివృద్ధిపై గళమెత్తారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత వరప్రసాదిని అయిన పొన్నుబోయిన చెంచురామయ్య గండిపాలెం రిజర్వాయర్ అభివృద్ధి నియోజకవర్గంలోని 149 చెరువుల కాలువల అభివృద్ధి కోసం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని సభాపతి రఘురాం కృష్ణంరాజు ద్వారా ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎంఎల్‌ఎ కోరారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో 149 చెరువులు ఉన్నాయని, వర్షాలు కురిసి చెరువులలోనికి నీరు చేరిన చెరువు నీటిని రైతాంగం ఉపయోగించుకునేందుకు చెరువు కాలువలు సరిగా లేవన్నారు. చెరువు కాలువల పూడికతీత పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గండిపాలెం రిజర్వాయర్‌కు ప్రత్యేకంగా అకౌంట్ లేదని అకౌంట్ ఏర్పాటు చేయడంతో పాటు, రిజర్వాయర్ కాలువల పూడికతీత పనులు చేపట్టాలని తెలిపారు. సొంత నిధులతో కొన్ని కాలువల పూడికతీత పనులు పూర్తి చేసి 4వేల ఎకరాలకు సాగునీరు అందించామని, మొత్తం ఆయకట్టు 16వేల ఎకరాలు అని ఆ భూమిని కూడా సాగులోని తెచ్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నూతన ఫీడర్లు ప్రారంభించిన ఎస్‌ఇ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్ ద్వారా మండలంలోని కరటంపాడు, వాసిలి, సబ్‌స్టేషన్ పరిధిలో 5నూతన ఫీడర్లను జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఇ విజయన్ నూతనంగా ప్రారంభిం చారు. వీటి ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్‌ఇ విజయన్ తెలిపారు. డిఇలు కృష్ణారెడ్డి, నాయక్, ఎఇలు హరికృష్ణ, సుబ్బా రెడ్డి, పి సునీత, షేక్ జమీల, బేగం, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రామిక మహిళలు చైతన్యవంతులవ్వాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో శ్రామిక మహిళలు చైతన్య వంతులు కావాలని లోక్ అదాలకు సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకొని సాంఘికంగా సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని కోరారు. కావలి మండలం ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో శ్రామిక మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజన మహిళలు పట్టణంలోని ఉద్యోగులు ధనవంతుల ఇళ్లల్లో పాచిపని చేసుకుని పేదరికంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా దినోత్సవం సందర్భంగా కష్టజీవు లైన శ్రామిక మహిళలు సమాజంపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. బాల్య వివాహాలను నియంత్రించి బాల బాలికలను పాఠశాలలకు పంపి "భేటీ బచావో భేటీ పడావో" కార్యక్రమంపై అవగాహన పెంచుకొని లోక్ అదాలత్‌లో ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు పొంది, సాంఘికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో యాటగిరి పావని, వై.ప్రభావతి, మౌనిక, పిచ్చమ్మ, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి-జలదంకి

బ్రాహ్మణక్రాక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం జెడ్‌పి డిప్యూటీ సిఇఒ జె.మోహన్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పి4సర్వే, ఎంఎస్‌ఎంఇ సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, జనరల్ ప్రోగ్రామ్స్ సర్వేలు జరుగుతున్న తీరుపై చర్చించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత జలదంకి ఎంపిడిఒ కార్యాలయానికి విచ్చేసిన ఆయన ఎంపిడిఒ బ్రహ్మయ్య, ఎఒ శ్రీధర్, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణకాక సర్పంచ్ ఇండ్ల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నీరజ, మారెళ్ల బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పి డిప్యూటీ సిఇఒ మోహన్‌రావు


జెడ్‌పి డిప్యూటీ సిఇఒను సన్మానిస్తున్న సిబ్బంది

సర్వేలను పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశకి-వింజమూరు

ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను పారదర్శకంగా వేగంగా చేపట్టాలని జెడ్‌పి డిప్యూటీ సిఇఒ మోహన్‌రావు సూచించారు. వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో ప్రజలకు సేవలను త్వరితంగా నిర్దేశిత కాలంలో అందించాలని సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ సంబంధించిన రికార్డులను పరిశీలించి పరిపాలనకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో గిట్టుబాటు ధర

ప్రజాశక్తి-బిట్రగుంట

రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని, రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పేర్కొన్నారు. బుధవారం బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, సొసైటీ, సివిల్ సప్లయి శాఖల ఆధ్వర్యంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. పుట్టి ధాన్యం రూ.19,780, క్వింటాకు రూ.2300 చొప్పున ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటలలో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ భరత్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ముంతాల వెంకయ్య, మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు పుచ్చకాయ రమేష్, మండల వ్యవసాయ అధికారులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న జెసి కార్తీక్

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని కరటంపాడు, బోయిలచిరువెళ్ళ గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.కిషోర్‌బాబు మండలంలోని అన్ని గ్రామాలను కలిపి 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిండికేట్ ఫార్మర్ సొసైటీ కో-ఆపరేటివ్ సొసైటీ వెన్నవాడ పిఎసిఎస్, బట్టేపాడు పిఎసిఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు సాగు చేస్తున్న వరి రకాలైన కెఎన్ఎం 1638 ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎన్‌ఎల్‌ఆర్ 34449 గ్రేడ్, ఎ, రకాలను పుట్టికి (850కేజీ) రూ.19720 లెక్కన అమ్ముకొనే వీలుంటుందని తెలిపారు. తర్వాత ధాన్యం కొనుగోలుకు నాణ్యత ప్రమాణాల గురించి తేమ శాతం నిర్ధారణ, శాంపిల్ సేకరణ ఇచ్చారు. ప్రతిఒక్క రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కలిగి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు షేక్.ఎస్థాని, ఎం.శ్రావణి, కరటంపాడు, బోయిలచిరువెళ్ళ, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీలో బుధవారం చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో పంచాయితీ కార్యదర్శులకు హరిత రాయబారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి డివిజన్ పంచాయతీ అధికారి రాధా మాధవి లత పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి నుండి చెత్తను ఏ విధంగా సేకరించాలి.. సేకరించిన చెత్తను ఏ విధంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వేరుచేసి దావారు కంపోస్టు ఎరువుగా మార్చాలి అనే దానిపై అధికారులకు శిక్షణను ఇచ్చారు. నాడెప్ తొట్లలో కంపోస్టు తయారీ, వర్మీ కంపోస్టు తయారీ, పశుపక్ష్యాదుల దహనవాటిక నిర్వహణతో పాటుగా గ్రీనరీ పెంచే విధానం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్లూరు మండలం విస్తరణ అధికారి పెంచల వీరేంద్ర, అల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రజనీకాంత్, మండలం పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, బోగోలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

'కస్తూర్బా'లో మహిళా దినోత్సవం


ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని ఎఎస్‌పేట సెక్టార్‌లో సిడిపిఒ ఆదేశాల మేరకు సూపర్వైజర్ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గురించి, పోషకాహార లోపం వలన వచ్చే అనర్థల గురించి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి, మహిళల హక్కులు, విధులు చట్టాల గురించి సూపర్వైజర్ వివరించారు. అంతేకాకుండా కిశోరీ బాలికలకు ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్లపై అవగాహన కల్పించి కిశోరీ బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మమ్మ, వారి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, సిహెచ్ సుశీలమ్మ, జి ఇందిరా దేవి పాల్గొన్నారు.



రామిరెడ్డిని కలిసిన మత్స్యకార నాయకులు

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గ వైసిపికి చెందిన మత్స్యకార ముఖ్య నాయకులు కావలి మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని బుధవారం బెంగళూరులోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు కావలి నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులపై ప్రధానంగా చర్చించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొమరి రాజు, గంగనగారి యాదగిరి, కొమరి శ్రీనివాసులు, గిరిబాబు, కొండూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో పీటర్ పాల్ మినిస్ట్రీస్ 8వ వార్షికోత్సవం, పీటర్ పాల్ మినిస్ట్రీస్ కన్వీనర్ దేవరకొండ పీటర్ పాల్ జన్మదినం సందర్భంగా బుధవారం ఏరియా ఆసుపత్రి సహకారంతో 7వ మెగా రక్తదాన, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించారు. ఈ శిబిరానికి యువత, ట్రాన్స్‌జెండర్లు, పాస్టర్లు పెద్దసంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పీటర్ పాల్ మినిస్ట్రీస్ వ్యవస్థాప కులు, దళిత గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర చైర్మన్ దేవరకొండ సుధీర్ బాబు స్వయంగా పాల్గొని రక్తదానం చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్‌కు నిరుపేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవరకొండ సుధీర్‌బాబు మాట్లాడుతూ పీటర్ పాల్ మినిస్ట్రీ ద్వారా యేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది రక్తదాన శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. నిరుపేదలకు వైద్యం అందించేందుకు ఎల్లవేళలా డాక్టర్ అందుబాటులో ఉండి పీటర్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతనంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించామని పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ క్యాంప్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, పాడేటి థామస్, పీటర్ పాల్ మినిస్ట్రీస్ సభ్యులు రేవరెండ్లు జయపాల్, ప్రభుదాస్, ఏసుబాబు, కృపారావ్, ఇమ్మానుయేలు, కలికి రాజేంద్ర, నెల్లూరు క్రిస్టియన్ నాయకులు బర్ణబాస్, ఊరందూరు సురేంద్ర, వైటి.రవి మినిస్ట్రీస్ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సుధీర్‌బాబు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి బుధవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలని పుట్టింటికి 19,720 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. రైతులకు సకాలంలో గోతాలు, లారీలు గాని సప్లై చేయడం జరుగు తుందని తెలిపారు. రైతులకు అందు బాటులో మండలంలోని వ్యవసాయ అధికా రులు ఉంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమ ంలో వ్యవసాయ అధికారి ఏడి సుజాత, వెంకట కృష్ణయ్య, రైతులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, సత్యం రెడ్డి, గ్రామంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రంలో 'ఇసిసిఇ'

ప్రజాశక్తి-ఉలవపాడు

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో వీరేపల్లి సెక్టర్‌లో పలు అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ఇ.సి.సి.ఇ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం చాగిచర్ల- 3, పెద్ద పట్టపాలెం రెడ్డిపాలెం, పెద్దపెట్టపాలెం-2 వీరేపల్లి-1 అంగన్వాడి కేంద్రాల్లో సూపర్‌వైజర్ ఎల్ విజయలక్ష్మి, అధ్యక్ష తన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.డి.పి.ఒ అరుణ పాల్గొని మాట్లా డారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం మెనూ పరిశీలించి "గర్భవతి ఆహ్వానం" కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

రీ-సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు పంచాయతీ పరిధిలో ప్రస్తుతం జరుగు తున్నభూ ముల రీ సర్వే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా సర్వే బృందం ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులో ప్రస్తుతం జరుగుతోన్న సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో ఆ ప్రాంతానికి సంబంధించిన రైతులు తప్పనిసరిగా ఉండేలా తగు చొరవ తీసుకోవా లన్నారు. ఏ రోజు సర్వే చేస్తారో రెండు రోజులకు ముందు ఆ ప్రాంత రైతులకు సమాచారం ఇచ్చి వారు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ బృందం, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో పునరావాస కేంద్రం

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణకాంత్

అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన వ్యక్తి వైద్య చికిత్సల అనంతరం రోగి త్వరగా కోలుకునేందుకు వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన పునరావాస కేంద్రం నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రాన్ని ఎస్‌పి జి. కృష్ణ కాంత్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహి ంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బింధు రెడ్డితో కలిసి పునరావాస కేంద్రాన్ని ఎస్‌పి జి. కృష్ణకాంత్ ప్రారంభిం చారు. ఈసందర్భంగా మీడి యాతో మాట్లాడుతూ నెల్లూరులో మొట్ట మొదటి సారిగా కార్పొరేట్ స్థాయిలో వైద్య సౌకర్యాలతో పాటు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో కొనసాగే ఈ కేంద్రం... చికిత్స పొందిన రోగులు త్వరగా కోలుకునేందుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్ యాజమా న్యాన్ని అభినం దిం చారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఏ హాస్పి టల్ కూడా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. మొట్ట మొదటి సారిగా మెడికవర్ హాస్పిటల్స్ లో ఏర్పాటు చేసినందుకు గర్వంగా ఉందన్నారు. చికిత్స పొందుతున్న వారికి, పొందిన తర్వాత రోగులకు ఈ కేంద్రం సంరక్షణగా ఉంటుందని వారు తెలిపారు. రోగి శారీరక, మానసిక సామర్థ్యాన్ని తిరిగి పొందేందుకు వంద శాతం ఈ కేంద్రం దోహద పడుతుందని పేర్కొన్నారు. కేన్సర్ లాంటి కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల నుండి ప్రజలు త్వరగా కోలుకునే విధంగా ఈ పునరావాస కేంద్రంలో అనేక సౌకర్యాలు, పరికరాలు అందుబాటులో ఉన్నాయని, స్ట్రోకులు, వెన్నెముక సమస్యలు వచ్చే అవకాశం ఉన్నవారికి ఈ కేంద్రం ద్వారా అవి రాకుండా నిరోధించే అవకాశం ఉందన్నారు. ఫిజియో థెరపి, స్పీచ్ థెరఫి ఇలాంటి సౌకర్యాలు కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ పునరావాస కేంద్రంలో రోగిని 24 గంటలూ పర్యవేక్షించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఎస్‌పి జి.కష్ణకాంత్ ను డాక్టర్ ధీరజ్ రెడ్డి, డాక్టర్ బింధు రెడ్డిలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, నర్సింగ్ హెడ్ శైలజ, మార్కెటింగ్ హెడ్ సతీష్, వైద్యులు, వైద్య సిబ్బంది, పిఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

ఆక్రమణలో గిరిజనుల శ్మశానవాటిక

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



బతికి ఉన్నప్పుడు ఎలాగూ సుఖప డలేదు చచ్చిన త ర్వాత అయినా సుఖపడుదాం.. అనుకొంటే అలాంటి పరిస్థితులు ప్రస్తుతం కనిపించ డం లేదు. పుట్టగొడుగుల్లా వెలుస్తు న్న వెంచర్లు అందుకు ఒక కారణం. రియల్ ఎస్టేట్ వ్యాపారం "మూడు పువ్వులు..ఆరు కాయలు" అన్న చందంగా విరాజిల్లు తుండడం తో భూముల ధరలకు రెక్కలు వస్తు న్నాయి. ఫలితంగా శ్మశాన వాటికలు సైతం అక్రమణలకు గురవుతున్నా యి. దీంతో ఆరడుగుల స్థలం కోసం నానా పాట్లు పడని పరిస్థితి నేటికి ఉంద ని చెప్పడం దురదృష్టకరం. శ్మశాన వాటికలు కబ్జా అ వుతుండడం తో దహన సంస్కారాల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవా లసిన దుస్థితి పేద గిరిజనుల కు దాపు రించింది. ఓ దాత గిరిజ నులకు శ్మశానవాటిక కోసం ఇచ్చిన భూమిని ఓ బడా ఆసామి దర్జాగా ఆక్రమించి ఎంచక్కా తన పొలంలో కలిపేసుకొని మానవీయ విలువలకు పాతరేయడం. ఈ నీచ నికృష్ట ఘటన తోటపల్లిగూడూరు మండ లంలో చోటుచేసుకుంది. గిరిజనులు వెళ్లబోసుకొన్న గోడు మేరకు వివ రాల్లో కి వెళితే...మండలంలోని పాపి రెడ్డిపాలెంలో నివాస ముంటున్న పేద గిరిజనులు మృతి చెందిన తమ వారి ని పాతిపెట్టేందుకు అవసరమైన శ్మశానం కోసం అదే గ్రామానికి చెందిన దాత మారంరెడ్డి ఓబుల్ రె డ్డి 536/2 బి సర్వే నంబర్లో సుమా రు 50 సెంట్ల (అర ఎకరా) భూ మిని 50 ఏళ్ల క్రితం తన పట్టా విరాళంగా ఇవ్వడం జరి గింది. దాంతో గిరిజను లు సంబర పడ్డారు. గిరి జ నులకు ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు. అం దుకు గిరిజనుల శ్మశాన వాటిక కోసం దాత ఓబుల్ రెడ్డి ఇచ్చిన భూమి ప్రస్తుతం ఓ భూ స్వామి అక్రమణలో ఉండడం అం దుకు కారణం. ఇక్కడ ట్విస్ట్ ఏమి టంటే దాత ఓబుల్ రెడ్డి గిరిజనుల శ్మశాన వాటిక కోసం విరా ళంగా ఇ చ్చిన ఈ భూమి పేడూరు గ్రామానికి చెందిన ఓ రైతు పేరుతో రిజిస్ట్రేషన్ అయి వుండడం. ఒకవేళ రిజి స్ట్రేష న్ చేయాల్సి వస్తే దాత ఓబుల్ రెడ్డి చేయాలి. ఓ బుల్ రెడ్డి కాకుండా మూడో వ్యక్తి ఎలా రిజిస్టర్ చేశా రు ? రిజిస్టర్ చేసిన ఆ మూడో వ్యక్తి ఎవరు? అనేవి అర్థం గాని అంశాలే అయ్యాయి. దాంతో దాత ఓబుల్ రె డ్డి గిరిజన శ్మశాన వాటిక కోసం వి రాళంగా ఇచ్చిన భూమి మరో వ్యక్తి పేరుతో అయిన రిజిస్ట్రేషన్ పేక్ అ న్న సందే హాలు వ్యక్తం అవుతున్నా యి. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని పేద గి రిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు. చివరికి పేద గిరిజనుల శ్మశానం సై తం ఆక్రమణ కు గురికావడంపై మం డల ప్రజలు ఛీ కొడుతున్నారు.

మందుల వాడకంలో నిర్లక్ష్యం తగదు


ప్రజాశక్తి-కోవూరు

కోవూరు పంచాయతీ పరిధిలోని శాంతినగర్లోని లక్ష్మీపార్వతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం ఎన్‌పిహెచ్‌సిఇ ప్రోగ్రాంలో భాగంగా ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు మందులు వాడకంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏమైనా అనారోగ్యం ఉంటే వెంటనే ఆశ్రమ నిర్వాహకులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఈ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి అందులో



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అవసరమైన వారికి ఈ నెల 7వ తేదీ శుక్ర వారం స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్మశాన వాటికను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆక్రమణకు గురి కాకుండా తమ శ్మశానవాటికను కాపాడాలని బుధవా రం ముస్లిం పెద్దలు ఎస్‌ఐ వీరేంద్ర బాబుకు విజ్ఞప్తి చేశారు. ముస్లిం పెద్దలు తెలి పి న మేరకు వివరాలు ఇలా వున్నా యి. మండలం ఈదూరు గ్రామానికి చెందిన ముస్లిముల శ్మశాన వాటికను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆక్రమిం చేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేప థ్యంలో ముస్లిం పెద్దలు ఆక్రమణ ప్ర యత్నాన్ని అడ్డుకున్నారు. దాంతో ఒకింత ఉద్రిక్తత చోటు చేసుకొంది. దాంతో ముస్లిం పెద్దలు తహశీల్దార్ ను కలసి తమకు చెందిన శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో ముస్లిం పెద్ద లు ఖాదర్ బాషా, పెద్ద నజీర్, లతి ఫ్, ఇస్మాయిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ఈదూరులో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని ఈదూరు గ్రామంలో వ్యవ సాయ శాఖ అధికారి వివి శిరీష రాణి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగి ంది. ఈ కార్యక్రమంలో పా ల్గొన్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ. రాజ్ కు మార్ మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొ నుగోలు చేయడం జరుగుతుం దన్నారు. ఈ మేరకు పుట్టి సాధారణ రకానికి రూ 19,550, 19720 గ్రేడ్ ఏ రకానికి రూ. 19,720 ప్రభుత్వ మద్దతు ధర ఇస్తున్నట్లు ఆయన తె లిపారు. అయితే ధాన్యం తేమ శా తం17గా ఉండాలని రాజ్ కుమార్ సూచించారు. దాంతో రైతులు ధా న్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవ లసిన అవసరం లేదని ఆయన చె ప్పారు. వ్యవసాయాధికారి శిరీష రా ణి మాట్లాడుతూ రైతులు గ్రామ వ్యవసాయ సహాయకు లను రైతు సేవ కేంద్రాలలో సంప్రదించి తేమ శాతం నిర్ధా రించుకుని షెడ్యూలింగ్ వే యించుకోవాలని తెలిపారు. గోనె సంచులను రైతులకు ప్రభుత్వం స రఫరా చేస్తుంద ని ఆమె తెలిపారు. ధాన్యం రవాణా ఖర్చులు, హమాలీ లు ప్రభుత్వ లెక్కల ప్రకారం పైకము నేరుగా రైతుకు రా వలసిన దాన్యం సొమ్ముతో కలిపి రైతు ఖాతాలో ప డు తుందని శిరీష రాణి తెలిపారు.కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వాతి, వినీల్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలన

ప్రజాశక్తి-కలిగిరి

జిల్లా పరిషత్, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి జె. మోహన్‌రావు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతోన్న సర్వేలపై ప్రోగ్రెస్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. కలిగిరి 1,2 సచివాలయాలు సందర్శించి సిబ్బందితో సర్వేలపై సమావేశ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ప్రత్యూష , కార్యాలయ పరిపాలన అధికారి ఎం. జ్యోతిలక్ష్మి, మండల పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, అశోక్ పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.